



# నువ్వు లేని నేను

రమణారావు మీదమీద కొస్తున్నాడు. అతని చీపురుకళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి. అతని మీసాలు గొంగలి పురుగుల్లా వున్నాయి. అతని పళ్ళు ఏనుగు కోరల్లా వున్నాయి. యమున భయంతో బిక్కచచ్చిపోయింది. తన ముఖం మీదకు ముఖం పెట్టి నుదుటి బొట్టును తుడిచేయబోతున్న రమణారావును రెండు చేతలతోనూ గెంటేయబోయి ఆగిపోయింది. అతను తన భర్త!

యమున ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. ఒంటి నిండా చెమటలు. అమ్మయ్య- కలేకదా. ఇలాంటి కల ఎందుకొచ్చింది? రమణారావుకు తనంటే ప్రేమ. తనకూ అతనంటే ప్రేమ. మరెందుకిలాంటి కలవచ్చింది? ఆఫీసులో గోపీతో తను చనువుగా వుండడం రమణారావుకు కోపం తెప్పించిందా? గోపీ అంటే ఈ మధ్య తనకిష్టంగా వుంటోంది. అతనూ ఎంతో ఆదరం చూపిస్తున్నాడు. తనకు భయంగా వుంటోంది. తను తప్పు చేస్తోందా?

బుల్లి చేతులు తన గుండెల్ని తాకడంతో యమున ఆలోచనల్ని ఆపుచేసి, చంటోడిని అక్కున చేర్చుకుని పాలిచ్చింది. కొడుకు పాలు తాగుతుంటే మళ్ళీ భర్త గుర్తుకొచ్చాడు. అతని మంచితనం గుర్తుకొచ్చింది. ఆ వెంటనే ఆమెలో ఏదో వెలితి. భర్త జ్ఞాపకాలు

తనను భయపెడుతున్నాయేమిటి? అదీ రెండు నెలల నుంచే. గోపీ తనకు దగ్గరవు తున్నప్పటి నుంచే.

పాలుతాగిన చంటోడు నిద్రలోకి జారిపోయాడు. యమున జాకెట్టు బొత్తాలు పెట్టుకుని, కొడుకు తనల నిమిరి, నెమ్మదిగా మంచం మీంచి లేచి, బాత్‌రూమ్ కెళ్ళింది.

పక్షుల కూతలు వినిపిస్తున్నాయ్. పెరటి గుమ్మం తలుపు తెరచి చూసింది. తెల్లవారింది. చల్లగాలి వీస్తోంది. పెరట్లో నుంచుని ఆకాశం కేసి చూసింది. ఏం లేదు. శరీరానికేదో హాయి. ఓ రెండు నిమిషాలు వాకిట్లో అటూ ఇటూ తిరిగి, ముఖం కడుక్కుని లోపలికొచ్చింది. అంతలో తల్లి పాల ప్యాకెట్ తెచ్చి, యమున ముఖంలోకి చూసి, మౌనంగా పెరట్లోకెళ్ళింది. యమున నుదుటిపై వేలుపెట్టి చూసుకుంది. స్టిక్కర్ బొట్టు తగిలింది.

❀❀❀

యమున గబగబా ఆఫీసు మెట్లెక్కుతోంది. గోపీ 'హలో' అన్నాడు. యమున ఉలిక్కి పడి, అతని వంక చూసింది. చిన్నగా నవ్వాడు. యమున తలొంచుకుని ఆఫీసులో కెళ్ళింది.

"యమునా, ఉషోదయంలా మెరిసిపోతున్నావు" అన్నాడు గోపీ గుసగుసగా.

చిన్నగా నవ్వి తన సీటులో కూర్చుని ఫైలుతీసింది. "ఉషోదయంలా మెరిసి పోతున్నావు" యమున ముఖంలో మెరుపు. అంతలోనే మనసులో ఏదో వెరపు. ఈ వ్యవహారం ఎక్కడికి దారితీస్తుందో. ఆమెలో పాపభీతి.

"కృతఘ్నురాలివి" రమణారావు జేవురించిన ముఖం ఆమె కళ్ళల్లో కదిలింది.

ఒక్కసారిగా కళ్ళు మూసుకుంది.

నాలుగేళ్ళ క్రితం తనెవరో రమణారెవరో. పెళ్ళిచూపుల కొచ్చాడు. తను నచ్చిందని చెప్పాడు. "కట్నం మీ శక్తి మేరకివ్వండి. పట్టింపేమీ లేదు" అన్నాడు. అతను తనకూ నచ్చాడు. పెళ్ళయింది. పట్నంలో కాపురం. సినిమాలు, షికార్లు. పడగ్గదిలో పండువెన్నెల. అలకల ఎండ. ప్రసన్నపు వాన. ఇట్టే గడిచిన కాలం. కడుపు తలుపు తట్టిన బుల్లి సూరీడు ఆగమనం.

అనురాగాల వీణా తంత్రులు ఒకోసారి అకస్మాత్తుగా తెగిపోతాయని తనెప్పుడూ అనుకోలేదు. ఎన్నోసార్లలాగానే ఆ రోజూ సినిమా చూద్దామని వెళ్లారు. స్కూటర్ వెనక తను కూర్చుంది. చంటోడిని ఒళ్ళో పెట్టుకుని. ఏటి గట్టున వెళ్తూ గోదావరి పరవళ్ళను తను పరవశంతో చూస్తోంది. ఎంత పచ్చనిదీ లోకం అనుకుంది. ఈ పచ్చని లోకం వెంట కర్కశ కాలం వుందని తనకు తెలీదు. విజయాటాకీసు కెళ్ళారు. హౌస్‌ఫుల్ బోర్డు. ఇంటికి పోదామంది తను. "అప్పుడే వెళ్ళేం చేస్తాం. బ్రిడ్జిమీదకెళ్లి కాసేపుండి వెళ్దాం"

అని రమణారావు స్కూటర్ని అటుపోనిచ్చాడు. నేలమీద కొస్తున్న కారు మేఘంలా లారీ ఎదురుగా. అంతే ఏం జరిగిందో తనకు తెలీదు. తనూ చంటోడు గాయాలతో ఆస్పత్రిలో వున్నారు. రమణారావు పోయాడని కొన్నిరోజుల వరకూ తనకు తెలియదు. తెలిసేక-దుఃఖం. నిరాశల నీడలు. పగిలిన భవితవ్యం గోడలు. రమణారావు స్మృతుల వెల్లువ. నేను లేని నువ్వు లేవంటూ. ఆ తర్వాత అతని ఉద్యోగం తనకొచ్చింది.

"అల్లుడు తను పోయినా, నీకూ చంటోడికీ అదరువు చూపించాడు తల్లీ" అంది అమ్మ.

"ఆ మాటే చాలా మంది అన్నారు. తనకూ అలాగే అనిపించింది. "ఓరి దేవుడా, ఆ ప్రమాదంలో మమ్మల్నీ ఎందుకు తీసుకుపోలేదు" అని కనిపించని దేవునికి వినిపించేలా ఎన్నోసార్లు ప్రశ్నించింది.

ప్రతి ప్రశ్నకూ తృటిలో జవాబు దొరికితే ఈ శోధనలూ, పరిశోధనలూ ఎందుకు? మళ్ళీ ప్రశ్నే!

'యమునా అలా ఉన్నావేంటి? ఏవిటాలోచిస్తున్నావ్" అన్నాడు గోపీ.

యమున గోపీ మాటకు ఈ లోకంలోకి వచ్చింది. ఏం లేదన్నట్టుగా తలూపింది.

"సరే, నడు టిఫెన్ చేద్దాం"

"నాకు చేయాలని లేదు" అందామనుకునీ అనలేకపోయింది యమున.

గోపీ వెంట నడిచింది.

నిర్లిప్తంగా వుంటున్న తనలో గోపీ చైతన్యం కలిగించాడు. కబుర్లు చెప్పేవాడు. జోకులు చెప్పి నవ్వించేవాడు. ఎవరి బతుకూ ఒకరి కోసం ఆగిపోకూడదని చెప్పాడు. కష్టాలు పడని మనిషి లేడంటూ బుద్ధుని జాతక కథలు చెప్పాడు. "పూర్వం భర్తపోయిన ఆడది తెల్లచీరలే కట్టేది. ఇప్పుడు రంగుల చీరలూ కడుతున్నారు నీలాగే, మరి బొట్టు పెట్టుకుంటే తప్పేమిటి?" అనేవాడు. నిన్నటి నుంచీ తను బొట్టు పెట్టుకుంటోంది.

"పెళ్లాం పోయిన రెణ్నెల్లకే పెళ్ళి చేసుకుంటున్న మగాళ్లను చూస్తున్నావు కదా. అలాంటప్పుడు నువ్వు మాత్రం ఎందుకు చేసుకోకూడదు" అన్నాడు గోపీ.

తను మాట్లాడలేదు.

ఇంకోసారి మళ్ళీ అదేమాటన్నాడు.

తను నవ్వింది.

"ఆడదానికి ఒకసారి పెళ్ళవడమే కష్టమవుతోంది. నాకు రెండో పెళ్ళా? అదీ కొడుకున్న నాకు" అంది తను.

"నీ కిష్టమైతే నేనే చేసుకుంటాను" అన్నాడు.

అతనలా అంటాడని తను అనుకోలేదు. గట్టుమీద కూరున్నవాడి మాటల్లాగే భావించింది.

ఆ రాత్రి తనకు నిద్ర పట్టలేదు. శరీరం ఆత్రుత పడుతోంది. మనసు ఆగమంటోంది. తప్పంటోంది. రమణారావుకు అన్యాయం చెయ్యవద్దంటోంది. కృతఘ్నురాలివి కాకంటోంది.

యమున ఆలోచిస్తూ టిఫిన్ చేసింది. "సాయంత్రం ఆఫీసవగానే అలా పార్కు కెళ్దాం. సాకులేం చెప్పకు" అని యమున జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్లిపోయాడు గోపీ.

పచ్చని పార్కులో ఇద్దరూ కూర్చున్నారు. పూల మొక్కల వంక చూస్తోంది యమున. "రెండు పూలు కోసి తెచ్చేదా" అన్నాడు గోపీ.

"వద్దు. వద్దు"

"ఎందుకా కంగారు. చక్కగా తల్లో పెట్టుకోవచ్చుగా".

యమున కళ్ళల్లో నీళ్ళు.

"ఛఛ. ఇప్పుడేమన్నానని! కాలం మారిదంటే మనిషీ మారాడని అర్థం. మార్పు ఎప్పుడూ మంచి బతుక్కు చేర్పు కావాలి".

"నేనూ కొంత మారేను కదా"

"ఆ మారేదేదో పూర్తిగా మారు. అదేదో ఎవర్నో ఉద్ధరించడానికనుకోకు".

"మరి నువ్వు నన్ను పెళ్ళాడాలనుకుంటున్నది నిన్ను ఉద్ధరించుకోడానికా? నన్ను ఉద్ధరించడానికా?"

"గుడ్ నువ్వూ తర్కిస్తున్నావు. అది శుభసూచకం. ఎవర్ని ఉద్ధరించడానికీ కాదు. మనం సుఖపడడానికి"

"మీకమ్మాయిలు కరువయ్యారా"

"అనుకోను. అయితే నాకు నువ్వు నచ్చావు. మొదట్లో నీలో నిరాశను పోగొట్టడానికే పరిచయం పెంచుకున్నాను. తర్వాత నీ వ్యక్తిత్వం నాకు నచ్చింది. నిన్ను తోడు చేసుకుంటే నేనూ చేదోడు అవుతాను కదా అనుకున్నాను. రేపే నీ నిర్ణయం చెప్పాలి. నువ్వు కాదంటే నేనేమీ దేవదాసునవను. జీవితం జీవించడానికని నా విశ్వాసం. నువ్వు కాదంటే యమునతో జీవించే అవకాశం లేకపోయింది. సరే మరో జమునతోనే సరిపెట్టుకుందాం అనుకుంటాను".

"నాకూ నువ్వంటే ఇష్టమే. ఆయనకు అన్యాయం చేస్తున్నట్టనిపిస్తోంది. ఆయనవల్ల వచ్చిన ఉద్యోగం చేస్తూ నేనింకొకరితో బతకడం ఆయనపట్ల కృతఘ్నురాలినవడం కాదా?"

"అదంతా నీ భ్రమ. అతను నీకు ఉద్యోగం ఇవ్వడం ఏంటీ నాన్సెన్స్. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నీకు ఉద్యోగం వచ్చింది. ఆ నిబంధనలే లేకపోతే నీకు ఆ ఉద్యోగం వచ్చేది కాదు. అంచేత కృతఘ్నత ప్రసక్తే లేదు. అంతగా అయితే ఆ ఉద్యోగం వదిలెయ్యి".

"చీకటి పడింది. వెళ్దాం" అని యమున లేచింది.

పార్కు బయటకొచ్చాక, "రేపు నువ్వు చెప్పే మంచి మాట కోసం ఎదురు చూస్తుంటాను" అని గోపీ ముందుకెళ్ళిపోయాడు.

యమున ఇంటికి నడిచింది చంటోడిని ఎత్తుకుని బుగ్గలపై ముద్దు పెట్టుకుంది. పాలు ఇచ్చింది. చంటోడ్ని ఒళ్ళో పడుకోబెట్టుకుని పుస్తకం చదువుతూ గడిపింది. తర్వాత, భోంచేసి, చంటోడ్ని నిద్రపుచ్చి, తనూ నడుం వాల్చింది.

గోపీ మాటలు గుర్తొచ్చాయి. అతను చెప్పింది సబబుగానే వున్నట్టనిపించింది. పోనీ, ఉద్యోగం ఒదిలేస్తే... ఎందుకొదలాలి? నాకు చదువులేకపోతే, ప్రభుత్వ నిబంధన వున్నా ఆ ఉద్యోగం వచ్చేది కాదు అనే ఆలోచన రాగానే ఆమె హృదయం తేలికపడింది. "రేపు గోపీ చెయ్యి తీసుకొని ముద్దుపెట్టాలి" అనుకుంది. నెమ్మదిగా నిద్రలోకి జారిపోయింది.

రమణారావు యమున మీదకు రాబోయి ఆగిపోయాడు. అతని చీపురుకళ్ళు చీపురు కళ్ళల్లాగా వున్నాయి. అతని మీసాలు మామూలు మీసాల్లాగే వున్నాయి. యమునకు భయం కలగలేదు. అతని వంక చూసింది. రమణారావు ఓకలగా వెనుదిరిగి కరిగిపోయాడు. నిద్రిస్తున్న యమున పెదవులపై చిర్నవ్వు విరిసింది.

*ఏప్రిల్ 1992, రచన మాసపత్రిక*
*తమిళంలో "నీ ఇల్లాద నాన్",*
*ఫిబ్రవరి 1994, త్రామరై మాస పత్రిక*
*అనువాదం : పు.ఆ.దురై రాజ*